క్లుప్తంగా...

ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ) కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. 1వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అక్టోబర్ 9న కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్‌లో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని విద్యార్థులకు సూచించారు.

బర్సిగూడ గ్రామ ప్యానల్ గెజిట్ విడుదల



బర్సిగూడ గ్రామ ప్యానల్ గెజిట్‌ను విడుదల చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కీసర: భోగారం అనుబంధ గ్రామంగా ఉన్న బర్సిగూడ గ్రామాన్ని ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా గుర్తించడం జరిగిందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం బర్సిగూడ గ్రామానికి సంబంధించి ప్యానల్ గెజిట్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, కీసర మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, భోగారం రైతు కన్వీనర్ పడమటి నర్సింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు డబ్బి నర్సింహారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనేర్ల సత్యనారాయణ, నత్తి భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు ఉచిత వైద్యం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ ఆస్పత్రిలో శనివారం అనాథ పిల్లలకు ఉచిత వైద్య సేవలు అందజేశారు. అల్వాల్‌కు చెందిన ఆయూష్ ఫౌండేషన్‌కు చెందిన 32 మంది చిన్నారులకు సీఎంఆర్ ఆస్పత్రి చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆదేశాలతో వైద్యులు ఉచితంగా పలు రకాల పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో డైరెక్టర్ అలీబేగ్, ఏఓ సురేశ్, పీఆర్వో దుర్గాప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమం ప్రారంభం



కీసరలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్ తదితరులు

కీసర: అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదనని కీసర ఎస్‌ఐ వెంకటేష్ అన్నారు. శనివారం కీసర వెంకటసాయిథియేటర్ వద్ద బల్‌దేవ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి, ఉపసర్పంచ్ లక్ష్మణ్, అన్నదాత నూకలగూడెం సత్తిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు బెలిదే రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట



గోధుమకుంట చెరువులో చేపపిల్లలను వదిలిపెడుతున్న సర్పంచ్ తదితరులు

కీసర: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం గోధుమకుంట చెరువులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేసిన సుమారు 45 వేల చేపపిల్లలను చెరువులో వదిలిపెట్టే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉపసర్పంచ్ ఆంజనేయులు, గ్రామకార్యదర్శి సురేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మంచాల పెంటయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్

- ఢిల్లీకి చేరిన కాంగ్రెస్ అభ్యర్థుల తుది జాబితా..
- ఎమ్మెల్యే మైనంపల్లి చేరికతో.. ఆశావహుల్లో ఆందోళన
- పార్టీ బలపడుతుందని పలువురిలో ఉత్సాహం..
- మరోవైపు అసంతృప్తులు చేజారకుండా కసరత్తు
- మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఇదీ



సాక్షి, మేడ్చల్ జిల్లా:హస్తినకు చేరిన తుది జాబితాలో తమ పేర్లు ఉన్నాయో.. లేదోనన్న ఉత్కంఠ కాంగ్రెస్ పార్టీ ఆశావహుల్లో తీవ్ర టెన్షన్‌కు గురిచేస్తోంది. టికెట్ పైరవీల కోసం ఆశావహులు ఎవరూ ఢిల్లీకి రావొద్దని అధిష్టానం ఇప్పటికే నాయకులకు సంకేతాలు ఇచ్చింది. సర్వే ఆధారంగానే టికెట్లను కేటాయిస్తామని, ఈసారి పైరవీలకు ఆస్కారం లేదని, గెలుపు లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేసింది. చివరి ప్రయత్నంపై ఆశలు పెట్టుకున్న నేతలకు అధిష్టానం ఢిల్లీకి రావొద్దని షాక్ ఇవ్వడంతో నిరాశే మిగులుతోంది. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని ఆశావహుల్లో టికెట్ వస్తుందా? లేదా? అనే సందిగ్ధత తీవ్ర ఉత్కంఠ రేకెత్తిస్తోంది.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా..

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీగా టీపీసీసీ అధ్యక్షుడు అనుముల రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండటంతో.. జిల్లాపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక ఫోకస్ పెడుతోంది. బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో.. పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవాన్ని నింపుతుండగా, మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తున్న ఆశావహులను మాత్రం తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది.

తీవ్ర అసంతృప్తితో నందికంటి శ్రీధర్

సిట్టింగ్ ఎమ్మెల్యే, సీనియర్ నేత మైనంపల్లి కాంగ్రెస్‌లో చేరడంతో జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తున్నప్పటికీ, ఇక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన అనుచరులు మాత్రం మల్కాజిగిరి కాంగ్రెస్ టికెట్ నందికంటికే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మల్కాజిగిరి అసెంబ్లీ స్థానం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం కావడంతో పార్టీకి పెద్ద తలనొప్పిగా మారిందన్న చర్చ ఆ పార్టీ వర్గాల నుంచే వ్యక్తమవుతోంది.

కాంగ్రెస్‌లోకి మైనంపల్లి

మల్కాజిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు బీఆర్‌ఎస్ అధిష్టానం టికెట్ ప్రకటించినప్పటికీ, కుమారుడు రోహిత్‌కు మెదక్ టికెట్ ఇవ్వలేదన్న అసంతృప్తితో రాష్ట్ర మంత్రి హరీష్‌రావుపై తీవ్ర విమర్శలు చేయటంతోపాటు రాజకీయ భవిష్యత్‌పై కార్యాచరణ ప్రకటిస్తానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కాంగ్రెస్ పార్టీలో చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు షరతులు కూడా విధించినట్లుగా జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. మల్కాజిగిరి తనకు, మెదక్‌లో తనయుడు రోహిత్‌కు టికెట్ ఇవ్వాలన్న డిమాండ్‌తో పాటు జిల్లాలో మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో తాను సూచించిన వారికి టికెట్ ఇవ్వాలన్న అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే.. ఎమ్మెల్యే మైనంపల్లి పెట్టిన షరతుల విషయంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాల్సిందేనన్న సందేహాలు కూడా రాజకీయ వర్గాల్లో లేకపోలేదు.

బుజ్జగించే ప్రయత్నం

మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ నేతల రాకతో.. పార్టీలో నెలకొన్న అసంతృప్తి వాదులను బుజ్జగించేందుకు అధిష్టానం ఆదేశాల మరకు పార్టీ పెద్దలు రంగప్రవేశం చేసినట్లు తెలుస్తోంది. తాత్కాలికంగా నిరాశతో ఉన్న నాయకులను సంతృప్తి పరిచేందుకు పలు హామీలతో నచ్చజెబుతున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే.. వారికి కట్టబెట్టనున్న పదవులు, ఇతర విషయాలను పేర్కొంటూ.. బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ప్రధానంగా మల్కాజిగిరి, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో కొంత నైరాశ్యం కనిపిస్తుండగా, వారితో పార్టీ పెద్దలు మంతనాలు జరుపుతుండటంతో పాటు రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేజిక్కించుకునే లక్ష్యాన్ని విస్మరించకూడదన్న విషయాన్ని మాత్రం నొక్కి చెబుతున్నారని స్థానిక కేడర్ పేర్కొంటోంది.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యం



రోడ్లను శుభ్రం చేస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య అన్నారు. శనివారం మున్సిపాలిటీలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని కమిషనర్ సాబేర్ అలీ, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన చౌరస్తాల్లో పరిసరాలను శుభ్రం చేశారు. అలాగే ప్లాస్టిక్‌ను ఏరివేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ స్వచ్ఛ మున్సిపాలిటీకి ప్రతి ఒక్కరూ భాగస్వాములై రోగాల వ్యాప్తిని నిరోధించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, శశికళ, మల్లేశ్, జహంగీర్, రవీందర్, మాజీ ఎంటీటీసీ గోపాల్‌రెడ్డి, ఎఫ్‌ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, మీనా, శశిబేగం, ఫయూమ్, జహంగీర్, అస్లాం, కొండాపూర్ విజ్ఞాన్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై అవగాహన పెంచుకోవాలి

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో పౌరహక్కుల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ నందకిశోర్, సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజు ముదిరాజ్, ఎంపీటీసీ వినోద హాజరై అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు విద్య అభ్యసించి పౌరహక్కులపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. నిరుపేదలు న్యాయం అందించడానికి సివిల్ రైట్స్ డే నిర్వహించామని, అధికారులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు దుర్గారాజు, ఆంజనేయులు, భాస్కర్, మాజీ సర్పంచ్ నాగరాజు, రాములు, జ్యోతి, సత్యానారాయణముదిరాజ్, సర్పంచ్ యాదగిరి, ఉప సర్పంచ్ రవి, రాములు, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.



కొర్రెముల్‌లో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్

ఎమ్మార్‌ఐఈటీలో హ్యాకథాన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌ఐఈటీ కళాశాలలో హ్యాకథాన్ నిర్వహించారు. ఎమ్మార్‌సీఈ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, ఎమ్మార్‌ఐఈటీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు తమలోని నైపుణ్యాలను ప్రదర్శించడానికి హ్యాకథాన్ సరైన వేదికన్నారు. సమాజంలో ఉన్న సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు కనుగొనాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. హ్యాకథాన్‌లో వివిధ కళాశాలల నుంచి 384 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఉత్తమ ప్రతిభ కనబర్చిన బృందాన్ని స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ కార్యక్రమానికి ఎంపిక చేయనున్నట్లు కో ఆర్డినేటర్ ధనలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హ్యాకథాన్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలి

మల్కాజిగిరి/గౌతంనగర్: బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలని మర్రి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆకుల నర్సింగరావు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు జితేందర్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమం బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని, రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించడానికి ప్రజల వద్దకు వెళ్లి అభివృద్ధి పథకాలతో పాటు పథకాల లబ్ధిదారుల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మురుగేష్, అరుణ్‌సింగ్, బద్దం పరశురామిరెడ్డి, వెంకన్న తదతరులు పాల్గొన్నారు.



ఈస్ట్ ఆనంద్‌బాగ్‌లో మర్రి రాజశేఖర్‌రెడ్డి

రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు

పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి



మాట్లాడుతున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీలో రూ.1.5 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ మురుగు కాల్వలు, సీసీ రోడ్లు, నారపల్లిలో వీధి కుక్కలను నియంత్రించడం, బతుకమ్మ పండగ, ఏర్పాట్లు, ఎల్‌బజీలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. మున్సిపల్ అభివృద్ధికి సహకరిస్తున్న కౌన్సిల్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్లు మహేశ్, ధనలక్ష్మీ, రాజశేఖర్, సాయిరెడ్డి, వెంకటేశ్‌గౌడ్, బాల్‌రెడ్డి, లక్ష్మీ, శ్రీలత, రవీందర్, సరిత, సుధాలక్ష్మీ, మమతారాణి, ఏఈ నరేశ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చీర్యాలలో రూ.36 లక్షలతో అభివృద్ధి పనులు



చీర్యాలలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో సర్పంచ్ తదితరులు

కీసర: చీర్యాల గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషిచేయడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ తుంగ ధర్మేందర్ అన్నారు. శనివారం గ్రామంలో సుమారు రూ.36 లక్షలతో చేపట్టిన వైకుంఠధామం ప్రహరీగోడ, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద సీసీరోడ్లు, మహిళా డ్వాక్రా గ్రూప్ భవన నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జిల్లాల తిరుమల్‌రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి

శామీర్‌పేట్: అవుటర్ రింగ్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. ఘటన శుక్రవారం అర్ధరాత్రి శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గాజులరామారం ప్రాంతానికి చెందిన అగెన్వార్ చంద్రకాంత్(50) డీసీఎం డ్రైవర్. శుక్రవారం అర్ధరాత్రి డీసీఎం వాహనాన్ని కీసర వైపు నుంచి శామీర్‌పేట వైపు ఓఆర్‌ఆర్ మీదుగా వస్తున్నాడు. శామీర్‌పేట సమీపంలోకి రాగానే డీసీఎం ఆగిపోయింది. దీంతో శామీర్‌పేట ఎగ్జిట్ వైపు నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. సమాచారం అందుకున్న పోలీసులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి మల్లారెడ్డితో రాంపల్లి దళితులు

కీసర: మంత్రి మల్లారెడ్డిని శనివారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో రాంపల్లి దళితులు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. కీసర మండల ఉద్యమకారులు కూడా మంత్రి మల్లారెడ్డిని కలిసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన మంత్రి మల్లారెడ్డి రాంపల్లి దళితుల సమస్యలతో పాటు కీసర మండల ఉద్యమకారులకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నేతలు తేళ్ల శ్రీధర్, మోర రవికాంత్, మాజీ ఎంపీటీసీ మీసాల మల్లేష్, ఎల్లమయ్య, శ్రీనివాస్, పరమేష్, భాస్కర్, మల్లేష్, నర్సింగ్‌రావు, యాదగిరి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో-59 లబ్ధిదారులు డబ్బులు చెల్లించాలి



ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ మతిన్, మేయర్ కావ్య

జవహర్‌నగర్: జీవో-59 కింద డిమాండ్ నోటీసులు పొందిన లబ్ధిదారులు డబ్బులు చెల్లించాలని కాప్రా మండల తహసీల్దార్ మతిన్ అన్నారు. శనివారం కాప్రా మండల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు జీవో-59పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మేయర్ మేకల కావ్య, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీవో-58, 59లను ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందన్నారు. జీవో-59 కింద నోటీసులు తీసుకున్న వారు డబ్బులు కట్టడంలేదని, మూడు దశల్లో డబ్బులు చెల్లించవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు జీవో-59 లబ్ధిదారులకు అవగాహన కల్పించి డబ్బులు చెల్లించేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జిట్టా శ్రీనివాస్‌రెడ్డి, మనోధర్‌రెడ్డి, మెట్టు వెంకన్న, సతీష్‌గౌడ్, ముఖేష్, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాగారంలో స్వచ్ఛత ర్యాలీ



నాగారంలో స్వచ్ఛత సేవా కార్యక్రమంలో ర్యాలీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: పరిసరాల పరిశుభ్రతతో పాటు ప్రతి ఒక్కరూ తడిపొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ పరిధిలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో నిర్వహించే ఏక్ తారీక్.. ఏక్ దిన్.. ఏక్ సాత్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో..

దమ్మాయిగూడ మున్సిపాలిటీలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపల్ పరిధిలోని టిఫిన్ సెంటర్లు, హోటల్స్, మాంసం దుకాణాలను సందర్శించి ప్లాస్టిక్ వస్తువులు, కవర్స్ వాడొద్దని మున్సిపల్ సిబ్బంది సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్, కమిషనర్ రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న మహేశ్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులుయాదవ్

ఘట్‌కేసర్: అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, రాష్ట్ర ప్రభుత్వ అసమర్థత కారణంగా నిరవధిక సమ్మె చేపట్టారని కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఘనాపూర్ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులుయాదవ్ విమర్శించారు. స్థానిక మండల విద్యాధికారి కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మెకు శనివారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే వారికి న్యాయం జరిగిందని, బకాయిలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం పంతం వీడి కార్మికులను చర్చలకు పిలిచి డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పక్షాన వారితో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సుచిత్ర, ఉప సర్పంచ్ పరమేశ్‌గౌడ్, సీఐటీయూ మండల కార్యదర్శి సబితా, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, వెంకటేష్, దేవేందర్‌ముదిరాజ్, నర్సింగ్‌రావు, రమేశ్ అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది, భోజన కార్మికులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కీసర: మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో సీసీ రోడ్లు వేయించడం అభినందనీయమని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి సాయిదుర్గకాలనీలో మంత్రి మల్లారెడ్డి సొంత నిధులు సుమారు రూ.12 లక్షల చేపట్టనున్న సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ గోక కళావతి తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తూ..

పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం



శామీర్‌పేట్: స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల కోసం వైద్య శిబిరం నిర్వహించామని చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ తెలిపారు. కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మేడ్చల్- మల్కాజిగిరి అడిషన్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య సెక్టోరియల్ అధికారులకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎన్నికల విధి విధానాలు, అధికారుల అప్రమత్తత, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సెక్టోరియల్ అధికారులకు వివరించారు. అందుకు సంబంధించిన శిక్షణ కూడా ఇచ్చారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 39 సెక్టార్లు ఉన్నాయి. బీఎల్‌వోలు, జీహెచ్‌ఎంసీ, తహసీల్దార్ కార్యాలయ అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. ఉప్పల్ తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మల్కాజిగిరి ఏసీపీ ఆకుల శ్రీనివాస్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ్ కుమార్, ఉప్పల్ ఏఎంసీ శ్రీనివాస్, కాప్రా అధికారులు తదితరులు పాల్గొన్నారు.